


వనపర్తి విద్యుత్ డీఈ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న విద్యుత్ కాంట్రాక్టర్లు

# సర్దుకుపోదాం రండి

- మీడియాకు సమాచారం లీకు చేయొద్దు
- కాంట్రాక్టర్లతో విద్యుత్ అధికారుల సమావేశం

**నమస్తే ఎఫెక్ట్**

వనపర్తి, జూలై 12 (నమస్తే తెలంగాణ) : విద్యుత్‌శాఖలో జరుగుతున్న పనుల వివరాలను మీడియాకు లీకు చేయొద్దని, ఇప్పటికే విద్యుత్‌శాఖ చాలా బదనాం అయిందని కాంట్రాక్టర్ల సమావేశంలో పలువురు విద్యుత్ అధికారులు మొరపెట్టుకున్నారు. విద్యుత్‌శాఖలో టెండర్లు లేకుండా ఇష్టానుసారంగా జరుగుతున్న పనుల తీరు, రెండేండ్లుగా పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ కనెక్షన్ల వ్యవహారంపైన 'నమస్తే తెలంగాణ'లో 'రైతుల నిరీక్షణ', 'గోల్‌మాల్ గోవిందా'.. అనే శీర్షికన ఇటీవల వరుస కథనాలు వెలువడ్డాయి. వీటిపై శుక్రవారం విద్యుత్ డీఈ కార్యాలయంలో విద్యుత్‌శాఖలో పనులు చేస్తున్న కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. విద్యుత్ శాఖలో జరుగుతున్న ప్రతి విషయాన్ని మీడియాకు ఎందుకు చెబుతున్నారని, ఎవరు చెబుతున్నారో కూడా తమకు తెలుసని, ఇది మంచి పద్ధతి కాదని అధికారులు సూచించారు. కనీసం ఇప్పటి నుంచైనా ఇలాంటి వాటికి అవకాశం ఇవ్వొద్దని, క్రమంగా శాఖపరమైన పనుల్లో పారదర్శకతను పెంచేందుకు కాంట్రాక్టర్లు తోడ్పాటునందించాలని కోరారు. అయితే కిందస్థాయిలో ఏఈ, ఏడీల నుంచే పనులకు సంబంధించిన ప్రతిపాదనలు డీఈ కార్యాలయానికి రావాలని, ఒక పద్ధతిని అమలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని సమావేశంలో నిర్ణయించారు. కాంట్రాక్టర్లు ఎలాంటి తొందరపాటు లేకుండా శాఖ సమాచారాన్ని బయటకు చేరవేయడాన్ని పూర్తిగా నిలిపివేయాలని, శాఖాపరంగా గాడితప్పిన వ్యవస్థను సరి చేసుకోవాలంటే కాంట్రాక్టర్లు కూడా తమకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎస్ఈ కే భాస్కర్, ఇన్‌చార్జి డీఈ డాక్టర్ రాచప్ప, ఏడీ స్టోర్ ఇన్‌చార్జి చక్రవర్తి, పలువురు సబ్ ఇంజినీర్లు, విద్యుత్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే వనపర్తి విద్యుత్ శాఖ పరంగా ఒక ఎస్ఈ, డీఈ, మరో ఏఈ లంచం తీసుకుంటూ ఏసీబీ వలలో చిక్కడం రాష్ట్రంలోనే చర్చనీయాంశమైంది. గతంలో ఎప్పుడూ విద్యుత్‌శాఖలో ఇలాంటి పరిస్థితి లేదు. ప్రతిపనికి లంచం అన్న రీతిలో విద్యుత్‌శాఖలో చాలా పనులు జరిగాయి. వీటిలో లక్షల రూపాయలు చేతులు మారినట్లుగా చర్చ ఉంది. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ పనితీరు సక్రమమైన విధానంలో జరగాలని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.



కల్వకుర్తి ఎంపీడీవో వెంకట్రాములుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న తర్నికల్ గ్రామస్తులు

# పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కల్వకుర్తి రూరల్, జూలై 12 : ఉపాధి పనులకు సంబంధించి కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని తర్నికల్ గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018 నుంచి గ్రామంలో 250 మంది కూలీలకు జాబ్ కార్డులుండగా వారిలో కేవలం వంద మందికి మాత్రమే కూలి డబ్బులు జమ చేశారని, మిగతా వారికి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈజీఎస్ డబ్బులు తమ ఖాతాల్లో జమ చేయబడతాయని తమకు తెలియకుండా సంతకాలు చేయించుకున్నారని ఆరోపించారు. గ్రామసభలు నిర్వహించకుండా గ్రామంలో కొద్ది మందితోనే ఆడిట్ పనులకు సంబంధించి విచారణ చేశారని ఆరోపించారు. తక్షణమే కలెక్టర్ స్పందించి పెండింగ్‌లో ఉన్న కూలి డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఎంపీడీవో వెంకట్రాములుకు వినతి ప్రతాన్ని అందజేశారు. కార్యక్రమంలో పీఏసీసీఎస్ వైస్‌చైర్మన్ శ్యాం, నాయకులు సురేశ్‌గౌడ్, శ్రీశైలం తదితరులు ఉన్నారు.



యాగం నిర్వహిస్తున్న దంపతులు

# అమ్మవారి దయ ఉండాలి

- ఇహపర సాధనకు చండీహోమం ఉత్తమమైనది
- శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానందస్వామీజీ
- 225 మంది దంపతులతో హోమాలు, 22 మందితో పుత్రకామేష్టి యాగం
- 400 మంది మహిళలతో సామూహిక కుంకుమార్చన

నాగర్‌కర్నూల్, జూలై 12 : ఇహపర సాధనకు చండీహోమం ఉత్తమమైనదని, చండీ అమ్మవారి దయ లోకమంతా ఉండాలని, అమ్మవారి దయ ఉంటే అన్ని ఉన్నట్లేనని శ్రీకృష్ణ జ్యోతి స్వరూపానందస్వామీజీ అన్నారు. నాగర్‌కర్నూల్‌లోని ఓంనగర్ కాలనీలో నిర్వహిస్తున్న చండీయాగ మహోత్సవ వేడుకలు ఆరో రోజూ కొనసాగాయి. శుక్రవారం 225 మంది దంపతులతో చండీహోమాలు, 400 మంది మహిళలతో సామూహిక కుంకుమార్చనలు, 22 మంది దంపతులతో పుత్రకామేష్టి యాగం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ చండీ సప్తశతిని సామూహిక హోమాల్లో భాగంగా 225 మంది దంపతులతో చండీహోమం నిర్వహించామన్నారు. చండీ హోమంలోని సప్తశక్తి యొక్క అంతరార్థాన్ని ఎంతో చక్కగా వివరించి హోమం ఎలా చేసుకుంటే సంపూర్ణ ఫలితం ఉంటుందనే విషయాన్ని భక్తులకు తెలిపి వారి చేత చండీ హోమాలని ఆచరింపజేశారు. మార్కండేయ పురాణంలో చండీహోమ విశిష్టతను తెలిపారని, 13 అధ్యాయాలు, 700 శ్లోకాలతో హోమం నిర్వహిస్తారన్నారు. అయితే దేశోపద్రవాలు శాంతించడానికి, గ్రహాల అనుకూలతకు, భయభీతులు పోవడానికి, శత్రు సంహారానికి, శత్రువులపై విజయం సాధించడానికి తదితర కారణాలతో ఆయుత చండీ, అతిరుద్ర యాగాన్ని పురస్కరించుకొని హోమాలను నిర్వహించారు. శనివారం ఉదయం సుదర్శన, పాశుపద, నవగ్రహ, లక్ష్మీనారాయణ హోమాలు, పుత్ర కామేష్టి హోమాలు, సాయంత్రం 6 గంటలకు లోక కల్యాణుడు శ్రీభూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపా కటాక్షాలు పొందాలన్నారు.



సామూహిక కుంకుమార్చనలు చేస్తున్న దంపతులు



వనపర్తి జిల్లా పరిషత్ కార్యాలయం



# ఎదురుచూపులు

## పదవి ముగిసింది.. వేతనం నిలిచింది

- ముగిసిన జెడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీకాలం
- ఆరు నెలలుగా అందని గౌరవ వేతనాలు
- వనపర్తి జిల్లాలో రూ.67 లక్షలు పెండింగ్
- ఆర్థిక ఇబ్బందుల్లో తాజా మాజీ ప్రజాప్రతినిధులు

ప్రజాప్రతినిధులకు ఇచ్చే గౌరవ వేతనాలకు గడ్డు పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్క ప్రజాప్రతినిధికీ గౌరవ వేతనం చెల్లించలేదు. స్థానిక ప్రజాప్రతినిధులు సమావేశాలకు రావడం.. సంతకాలు పెట్టడం తప్పా ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనాలకు మాత్రం నోచుకోవడంలేదు. జిల్లాలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులు కలిసి మొత్తం 144 మంది ఉన్నారు.

***రూ.67 లక్షలు పెండింగ్..***

జిల్లాలో పనిచేసిన ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, కో ఆప్షన్ సభ్యులకు ఇచ్చే గౌరవ వేతనాలు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. వీరిలో జెడ్పీటీసీ, ఎంపీపీ, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులకు నెలకు రూ.13 వేలు, ఎంపీటీసీలు, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులకు ప్రభుత్వం రూ.6,500 గౌరవ వేతనం చెల్లిస్తున్నది. అయితే వీరికి బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు చెల్లించింది. ఎలాంటి బకాయిలు లేవు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఆరు నెలలుగా వీరికి గౌరవ వేతనం చెల్లించడం లేదు. సమావేశాలు జరిపినా, చివరకు వారి పదవీ కాలం ముగిసినా గౌరవ వేతనాలు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇలా జిల్లాలోని వివిధ హోదాల్లో పని చేసిన ప్రజాప్రతినిధులకు ఆరు నెలలకు సంబంధించి దాదాపు రూ.67 లక్షల గౌరవ వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవి ఎప్పుడు వస్తాయో కూడా తెలియని పరిస్థితి ఉన్నది. వీటి కోసం చాలా మంది ప్రజాప్రతినిధులు ఎదురు చూడకపోయినా, కనీసం గౌరవ వేతనాలను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

### త్వరలోనే వేతనాలు చెల్లిస్తాం

జిల్లా పరిషత్, మండల పరిషత్‌లకు సంబంధించిన ప్రజాప్రతినిధుల గౌరవ వేతనాలు త్వరలోనే వస్తాయి. ప్రస్తుతం ఆరు నెలలుగా పెండింగ్ ఉన్నాయి. వీటిలో మూడు నెలల వేతనాలు వచ్చే రెండు, మూడు రోజుల్లో వారి అకౌంట్లలో జమ అవుతాయి. కార్యాలయం నుంచి చేయాల్సిన పనులను సిద్ధం చేశాం. వీటి అనంతరం మరో మూడు నెలల వేతనాలు మాత్రమే పెండింగ్‌లో ఉంటాయి. వాటిని వీలైనంత త్వరగా అందించే ప్రయత్నం చేస్తాం.

*- యాదయ్య, జెడ్పీ సీఈవో, వనపర్తి జిల్లా*

**జెడ్పీటీసీ, ఎంపీటీసీల పదవీ కాలం ముగిసినా.. నేటికీ జీతాలు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. గౌరవ వేతనాలు చెల్లించండి మహాప్రభో అంటూ స్థానిక సంస్థల తాజా మాజీ ప్రజాప్రతినిధులు వేడుకుంటున్నారు. ఈనెల 4వ తేదీ నాటికి ఐదేండ్ల టర్మ్ పూర్తవగా.. దాదాపు ఆరు నెలల గౌరవ వేతనాల చెల్లింపునకు ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి నెలా అందేవని, కాంగ్రెస్ హయాంలో ఎదురుచూపులు తప్పడం లేదని వాపోతున్నారు. ఒక్క వనపర్తి జిల్లాలోనే 144 మంది జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు ఉండగా.. రూ.67 లక్షలు అందాల్సి ఉంది. దీంతో ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు.**

*- వనపర్తి, జూలై 12 (నమస్తే తెలంగాణ)*

***ముగిసిన పదవీ కాలం..***

గ్రామీణ ప్రాంతాల్లో ఉండే అన్ని స్థాయిల ప్రజాప్రతినిధుల పదవీ కాలం దాదాపు ముగిసింది. ఐదేండ్లుగా జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ఎంపీపీలు పదవుల్లో కొనసాగారు. గత ఫిబ్రవరిలోనే సర్పంచుల పదవీకాలం ముగిసింది. జూలై 4తో జెడ్పీటీసీలు, జూలై 3తో ఎంపీటీసీల గడువు సమాప్తమైంది. ప్రస్తుతం అంతా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నది. గ్రామ పంచాయతీ నుంచి జిల్లా పరిషత్ వరకు ప్రత్యేకాధికారులు నియామకమయ్యారు.

# నిధులు లేవు.. నిర్వహణ ఎలా?

- డబ్బులు మంజూరు చేయని ప్రభుత్వం
- ఇబ్బందులు పడుతున్న పంచాయతీ కార్యదర్శులు

మూసాపేట, జూలై 12 : గ్రామాల్లో అభివృద్ధి పనుల నిర్వహణ కోసం ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించాలి. కానీ సర్పంచుల పదవీ కాలం ముగియడంతోపాటు ప్రభుత్వం పంచాయతీలకు నిధులు మంజూరు చేయకపోవడంతో గ్రామ పంచాయతీ ఖాతాలు ఖాళీగా ఉన్నాయి. దీంతో పంచాయతీల నిర్వహణ పంచాయతీ కార్యదర్శులకు కష్టంగా మారింది. సొంతంగా జేబులోంచి డబ్బులు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడడంతో పంచాయతీ కార్యదర్శులు తలలు పట్టుకుంటున్నారు. తప్పని సరి పరిస్థితుల్లో పంచాయతీ కార్యదర్శులు అప్పులు తెచ్చి మరీ కాలం వెళ్లదీస్తున్నారు. ఆగస్టు వరకు అయితే మళ్లీ సర్పంచులు వస్తారని నిబ్బరంతో ఉన్న వారికి ఇప్పట్లో సర్పంచుల ఎన్నికలు లేనట్లే అని తెలిసి దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

***పెరుగుతున్న నిర్వహణ భారం..***

ఫిబ్రవరి 2వ తేదీతో సర్పంచుల పదవీ కాలం ముగిసింది. అంతవరకు గ్రామ పంచాయతీ నిర్వహణ కోసం ఎలాంటి పనులు చేయాలన్నా వారు జేబులో నుంచి మొదలు ఖర్చు చేసేవారు. తర్వాత పంచాయతీ నిధుల నుంచి డ్రా చేసుకొనే వారు. వారి పదవీకాలం ముగిసిన తర్వాత ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆ భారం మొత్తం పంచాయతీ కార్యదర్శులపై పడింది. అంతేకాక గ్రామానికి పర్యవేక్షణ కోసం అధికారులు, ఇతరులు కాని వస్తే ఆ డబ్బులు సొంతగా సర్పంచులు భరించే వారు. కానీ ఇప్పుడు పంచాయతీ కార్యదర్శుల జీతం డబ్బుల నుంచి పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంది. అంతే కాక ఇప్పటివరకు పంచాయతీల నిర్వహణ కోసం తెలిసిన వారు, గ్రామంలో కొంత పరిచయం ఉన్న వారితో రూ.50 వేల నుంచి లక్షల వరకు పంచాయతీ కార్యదర్శులు అప్పు రూపంలో తీసుకొని నిర్వహణ ఖర్చులను భరిస్తూ వస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ నిధులు విడుదల చేయకపోతే కార్యదర్శుల బతుకులు బజారున పడే అవకాశం లేకపోలేదు.

***అంటీముట్టని ప్రత్యేకాధికారులు..***

పంచాయతీల పాలకవర్గం పదవీ కాలం ముగిసిన తర్వాత గ్రామ పంచాయతీలకు మండలంలోనే విధులు నిర్వహిస్తున్న అధికారులను ప్రత్యేకాధికారులగా నియమించారు. వారికి ఒక్కో అధికారికి రెండు నుంచి మూడు గ్రామ పంచాయతీల వరకు బాధ్యతలు అప్పగించారు. దీంతో వారు రోజూ నిర్వహించాల్సిన బాధ్యతలతోపాటు పంచాయతీ కార్యదర్శులపై పర్యవేక్షణ చేస్తున్నారు. నిర్వహణలో, నిధుల సమకూర్చడంలో వారు అంటిముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో అంతా తామై పంచాయతీ కార్యదర్శులే భారమంతా మోస్తున్నారు.

***ఆరు మాసాలుగా నిధులు రాక..***

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పంచాయతీలకు నిధులు విడుదల చేయలేదు. అంతకు ముందు ఎన్నికల కాలంలో కూడా నిధులు మంజూరు కాకపోవడంతో పంచాయతీ ఖాతాలన్నీ ఖాళీగా మారాయి. ఇటీవల వచ్చిన పన్నులు చిన్నా చితక నిర్వహణ ఖర్చులకు కూడా సరిపోవడం లేదు. జనాభా ప్రతిపాదికగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదలవుతాయని, కానీ చిన్న గ్రామ పంచాయతీల మాట పక్కన బెడితే పెద్ద గ్రామ పంచాయతీలు, మండల కేంద్రాల నిర్వహణ పంచాయతీ కార్యదర్శులకు తలకు మించిన భారంగా మారుతుంది. ఫిబ్రవరి కంటే ముందు సర్పంచులు నిర్వహణ కోసం పెట్టిన ఖర్చు చాలా ఉన్నాయి. అందుకు తోడు సిబ్బంది జీతాలు ఉన్నాయి. ఇప్పుడు నిధులు వచ్చినా మొదట అవి పూర్తయిన తర్వాత మిగిలితేనే కార్యదర్శులు పెట్టిన ఖర్చులు చేతికి వచ్చే అవకాశం ఉన్నది. మహబూబ్‌నగర్ జిల్లాలో పంచాయతీలు వివరాలు పరిశీలిస్తే మొత్తం 441 గ్రామ పంచాయతీలలో 6,36,743 జనాభా ఉన్నది.




నిజాలాపూర్ గ్రామ పంచాయతీ భవనం

## అభిప్రాయాల మేరకే..

# రైతు భరోసాపై నిర్ణయం

- తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు
- మంత్రులు తుమ్మల, పొంగులేటి
- పదెకరాల వరకు సాయం అందించాలన్న రైతులు
- హాజరైన మంత్రి జూపల్లి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీ, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, చిత్రంలో పొంగులేటి, జూపల్లి, చిన్నారెడ్డి, ఎంపీ మల్లురవి

వనపర్తి, జూలై 12 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో రైతులు, రైతు సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు, మేధావుల అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే రైతు భరోసాపై ఓ నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు చెప్పారు. ఇప్పటికే వచ్చే నెలలో రుణమాఫీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారని, ఇందుకు నిధుల సమీకరణ ప్రక్రియ వేగవంతంగా జరుగుతున్నదన్నారు. శుక్రవారం రైతు భరోసాపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతుల అభిప్రాయ సేకరణ కోసం వనపర్తి జిల్లా కలెక్టరేట్‌లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవితో పాటు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ముందుగా మంత్రులను స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ వ్యవసాయం చేస్తున్న ప్రతిరైతుకు రైతు భరోసా కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. గతంలో జరిగిన లోపాలను సవరిస్తూ సరైన పద్ధతిలో పథకాన్ని అమలు చేయడంలో భాగంగానే రైతుల అభిప్రాయాలు సేకరిస్తున్నామన్నారు. సన్న, చిన్నకారు రైతులకు ప్రభుత్వం చేయూతనిస్తున్నదని, రైతులకు మేలు జరిగే విధంగానే నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ అభిప్రాయాల సేకరణ అనంతరం అసెంబ్లీలోనూ చర్చించి రైతు భరోసాపై ఓ నిర్ణయానికి రావడం జరుతుందని తుమ్మల పేర్కొన్నారు.

***దుర్వినియోగాన్ని అరికట్టడం కోసమే : పొంగులేటి***

రైతుబంధు పథకం ద్వారా గతంలో జరిగిన దుర్వినియోగాన్ని నివారించడం కోసమే రైతుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కేవలం వ్యవసాయం చేస్తున్న రైతులకు మాత్రమే రైతు భరోసా అందించాలన్నదే లక్ష్యమని, పథకాల పేరుతో ప్రజలకు ఇచ్చే పరిహారమంతా ప్రజల నుంచి వచ్చిందే ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా ఉండాలన్న ఉద్దేశంతోనే ఓపెన్ డిబెట్ ద్వారా రైతుల అభిప్రాయ సేకరణ కొనసాగుతుందన్నారు. రైతు భరోసాపై ఇప్పటికే నిర్ణయం జరిగిందని చేస్తున్న తప్పుడు ప్రచారాలను రైతులు నమ్మొద్దన్నారు. అసెంబ్లీ ఏర్పాటు జరిగేలోపు ఈ కార్యక్రమాలను ముగిస్తామని పొంగులేటి చెప్పారు.

***ప్రతీది లెక్క ప్రకారమే జరగాలి : మంత్రి జూపల్లి***

రైతు భరోసా పథకంలో ప్రతీదీ లెక్క ప్రకారమే జరగాలన్న లక్ష్యంతోనే రైతు అభిప్రాయాల సేకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మంత్రి జూపల్లి కృష్ణా రావు పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా ఒక్క రూపాయి కూడా నష్టం జరగడానికి వీలు లేకుండా చర్యలుంటాయన్నారు. గతంలో జరిగిన తప్పిదాలను మళ్లీ జరగకుండా తగిన చర్యలు తీసుకోవడం జరుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని మంత్రి వెల్లడించారు. అనంతరం చిన్నారెడ్డి మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన రైతుబంధు పథకాన్ని 12 దఫాలుగా ఆర్థిక సాయం అందించిందని, తనకు 80 ఎకరాల వ్యవసాయ పొలం ఉందని, తాను ఒక్క రూపాయి కూడా రైతుబంధు ద్వారా తీసుకోలేదని చెప్పారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికశాతం రైతులు 10ఎకరాలలోపు ఉన్న వారే 90 శాతానికిపైగా ఉన్నారన్నారు. నిరుపేద, మధ్యతరగతి రైతులకు ఇబ్బందులు లేకుండా రైతు భరోసా పథకాన్ని అమలు చేసేందుకు అభిప్రాయలు సేకరిస్తున్నదని వివరించారు. సమావేశంలో రైతులు అధిక శాతం పదెకరాల వరకు రైతు భరోసాను అమలు చేయాలని కోరారు. సమావేశానికి ఎమ్మెల్యేలు మేఘారెడ్డి, వంశీకృష్ణ, రాజేశ్‌రెడ్డి, వాకిటి శ్రీధర్, పర్ణికారెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టర్లు విజయేంద్రబోయి, సంతోష్ బదావత్, సంచిత్ గంగ్వార్, సిక్తా పట్నాయక్, బీఎం సంతోష్, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



అభిప్రాయ సేకరణకు హాజరైన రైతులు



వనపర్తి కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన శ్రీశైలం ముంపునిర్వాసితులు

# ఉద్యోగావకాశాలు కల్పించాలి

- వనపర్తి కలెక్టరేట్ ఎదుట శ్రీశైలం ముంపు నిర్వాసితుల బైఠాయింపు

వనపర్తి, జూలై 12 : శ్రీశైల జలవిద్యుత్తు ప్రాజెక్టు నీటి ముంపు కింద నష్టపోయిన బాధితులకు గత ఉమ్మడి రాష్ట్రంలో అమలు చేసిన జీవో నెం.68, 2014 ప్రకారం ప్రాజెక్టు నిర్వాసిత నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మంత్రి జూపల్లికి శ్రీశైలం జల విద్యుత్ ప్రాజెక్టు నిర్వాసితులు వినతి పత్రాన్ని అందజేశారు. శుక్రవారం వనపర్తి కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితులు ఎన్నో సంవత్సరాల నుంచి ఉద్యోగ అవకాశం కోసం ఎదురుచూస్తున్నామని, గత కాంగ్రెస్ ప్రభుత్వంలోనే 200 మంది నిర్వాసితులకు ఉద్యోగావకాశాలు కల్పించారని, సీఎం కూడా సొంత జిల్లావాసి కాబట్టి ఉద్యోగాలు ఇప్పించేందుకు కృషి చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో రెండువేల మంది నిర్వాసితులను గుర్తించినట్లు తెలిపారు. వీరందరికీ ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మంత్రికి విన్నవించారు.

## టీబీ డ్యాంకు స్థిరంగా వరద

అయిజ, జూలై 12 : కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు వరద స్థిరంగా కొనసాగుతున్నది. శుక్రవారం టీబీ డ్యాంలోకి ఇన్‌ఫ్లో 18,550 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 205 క్యూసెక్కులుగా నమోదైంది. డ్యాం గరిష్ఠ నీటి నిల్వ 105.855 టీఎంసీల సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 29.161 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది. 1633 అడుగుల పూర్తి స్థాయి నీటి మట్టానికి గానూ ప్రస్తుతం 1605.28 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.